# అంతిమ యాత్ర ★

కుమారి సిద్ధాబత్తుల సరోజ

మద్రాసుకు పోయేరైలు బెజవాడలో ఆగింది. ప్రయాణీకులు హడావిడిగా సామాను దింపుకొంటున్నారు. దిగేవాళ్ళని దిగనియ్యకుండా ఎక్కేవాళ్ళు తోసుకుంటూ లోపలికి ఎక్కుతున్నారు. చుట్ట, బీడీ, సిగరెట్ కేకలు చెవులు గింగిరుమనిపిస్తున్నాయి. రైల్వేహోటల్లో కప్పుల చప్పుడు పెరుగుతున్నది. యజమాని రూపాయల సంపాదనలో నిమగ్నుడయ్యాడు. ఆడవాళ్ళ పెట్టెలోంచి చిలకల సేతామహాలక్ష్మి దిగి, భర్తరాకకై ఎదురుచూస్తోంది. రెండుచేతుల్లోను రెండుపెట్టెలు పట్టుకొని ఆమె భర్త చిలకల చినవెంకటేశ్వర్లు ఆమెదగ్గిరకొచ్చి "జాగ్రత్తగా దిగావా" అంటూ కుశలం అడిగి ఆమె వదనంమీద మెరిసిన చిరునవ్వును జాగ్రత్తగాహృదయంలోకి తోసేసి, అవలీలగా సామాను మోసేసుకొని ప్లాట్‌ఫారం దాటాడు.

మళ్ళాహడావిడి తగ్గింది. ఇంక రైలు కదలటానికి ఆట్టేవ్యవధి లేదు. రైల్వేహోటలువాడు పెట్టిన మెతుకులు ఆప్యాయంగా స్వీకరించి రైల్లో పడ్డారు జనం. సుమారు ఎనభై సంవత్సరాల వృద్ధుడు రైలెక్కి ఓమూలగా కూర్చున్నాడు. ఒంకర టింకరగా ఉన్న విభూతి రేఖలు అతని జీవితపు కష్టాల్ని తెలియ జేస్తున్నట్లుగా ఉన్నాయి. అతని సామానంతా కలిసి ఒకమూట, ఒకచెంబు, చంకలో ఒక తాళ పత్రగ్రంథం తప్పితే మరేంలేదు. ఎంతటి గంభీర ముఖమైనా అతనికళ్ళు లోతుగావెళ్ళిపోవటంవల్ల కృశించిపోయినట్లుగా ఉంది. ఒకమూలగా కూర్చుని అతడు ప్లాట్‌ఫారమ్‌కేసి చూస్తున్నాడు. అతని విగ్రహం చూడగానే ప్రతీవ్యక్తికీ నమస్కరిద్దామనే తలంపు రాకతప్పదు.

గడియారాన్ని తిట్టుకుంటూ గార్డుపచ్చజెండా ఊపాడు. పచ్చజెండానిచూసి విసుక్కుంటూ డ్రైవరు రైలుకి ఓ మొట్టికాయ మొట్టాడు. డ్రైవరు చేసిన అఘాయిత్యపు పనికి అసహ్యించుకుంటూ రైలుకదిలింది. "నేనొచ్చేవరకు జాగ్రత్తసుమా" అన్నాడు. రైల్లో కూర్చున్న చిగుళ్ళ వేంకటరత్నం ప్లాట్‌ఫారమ్‌మీదనున్న భార్యనుద్దేశించి మీరు మటుక్కు ఉత్తరాలు రాస్తూ ఉండకపోతే నేను యింట్లో ఉండలేనుసుమా" అంటూ వక్షస్థలం మీద పడబోతున్న నీళ్ళని పమిటకొంగుతో అద్దేసుకుంది.

రైలు ఒంగోలు స్టేషన్ సమీపించింది. వృద్ధుడు కూర్చున్న పెట్టెలోకి టికట్‌కలెక్టరు వచ్చాడు. అందరి టికెట్లమీద సంతకాలు పెట్టాడు. ఏదో ఆరాత్రి నాలుగు రూపాయలు సంపాదించుకుందామన్న అతనికి అందరూ టిక్కెట్లు కొనడంతో ఒళ్ళుమండింది. వృద్ధుడు కునికిపాట్లు పడుతున్నాడు.

"ఏయ్‌ముసిలాడా టికెట్టుకొన్నావా?" అంటూ అతన్ని లేపాడు.

వృద్ధుడు ఉలిక్కిపడిలేచి టికెట్టు కలెక్టర్ని చూశాడు. అతని ముఖంలో విచారపు రేఖలు దట్టంగా కమ్మేశాయి.

"లేదునాయనా— టికెట్టుకొనేటంత డబ్బునాదగ్గిరలేదు. అయినా ఈ వయస్సులో ప్రయాణం చెయ్యక తప్పలేదు. గూడూర్లో దిగిపోతాను. నీవు కటాక్షించాలి. నేను నీ తండ్రివంటివాణ్ణనుకో." అని బ్రతిమాలాడు వృద్ధుడు.

కాని టికెట్టుకలెక్టరుకు వృద్ధుడు చెప్పేది వినపడలేదు. ఏదోకొంత ఆ వృద్ధుడి దగ్గరనుంచి గుంజవచ్చునన్న ఆనందంతప్ప మరేంలేదు ఆ హృదయానికి. ఇంటిదగ్గర భార్య కొత్తరకంచీరె బజార్లో చూసినప్పటినుంచి పొడిచి చంపేస్తోందికొనమని. ఏదోవిధంగా ఆమెకొర్కె తీర్చాలి!

"ఎందుకొచ్చిన ఏళ్ళయ్యా- తాడిచెట్టుకు వస్తున్నాయి నీకు వస్తున్నాయి. ఏంలాభం టికెట్టులేకుండా ప్రయాణం చేస్తూ పైగాడబ్బులేదని అబద్ధాలాడుతున్నావు. తియ్యి డబ్బుతియ్యి" అంటూ గర్జించాడు. టికెట్ కలెక్టరు.

"అబద్ధాలాడవలసిన వయస్సు దాటిపోయిందినాయనా ప్రస్తుతం అబద్ధాలాడవలసిన అవసరం నాకులేదు. నిజంగా నాదగ్గర అంతడబ్బులేదు. అంతా కలిపి రెండు రూపాయలుంటాయి. ఇంకమిగిలిన ఆస్తి ఆరెండు రూపాయలే. నిన్ను వేడుకొంటున్నాను. ఈ చలిలో ఇక్కడ

దింపేస్తే చచ్చిపోతాను. గూడూర్లో ఎటూ దిగిపోతాను. కాస్త దయతల్చు నాయనా" దీనంగా అడిగాడు వృద్ధుడు.

"ఇదిగో ముసిలాడా. చెప్తున్నానువిను. లెఖ్ఖ ప్రకారం నువ్వు జుల్మానాతో కలిసి పదిహేను రూపాయలు కట్టాలి. కాని నేను మిగిలిన వాళ్ళకంటే మంచివాణ్ణి కమక పది రూపాయలతో పోనిస్తున్నాను. తొందరగా డబ్బుకట్టేయి" అనిహెచ్చరించాడు కలెక్టరు.

"ఉన్న విషయం దాచకుండా నేను చెప్పాను. కావాలంటే నాదగ్గరఉన్న రెండు రూపాయిలు తీసుకొని గూడూరు వరకు పోనీయి. అదొక్కటే నిన్నుకోరేది" వృద్ధుడు.

టికెట్ కలెక్టరుకి తెల్సు. దింపివేస్తేనే కాని డబ్బు బయటకు రాదని. రోజూ అల్లాంటి కేసులు అతనికి చాలా తగుల్తాయి. అందు వల్లనే ఒంగోలులో అతన్ని దింపివేశాడు. పెట్టెలో వాళ్ళంతా అంత అర్ధరాత్రి విపరీతమైన చలిలో ఆ వృద్ధుణ్ణి దింపివేసినందుకు టికెట్ కలెక్టర్ని దూషించుకున్నారు. "వాడిది హృదయమా లేక దేవదారు చెక్కా" అంటూ టికెట్ కలెక్టర్ని గూర్చి పక్క స్త్రీతో చెప్పింది ఓ వృద్ధురాలు. టికెట్ కలెక్టరుకు ఆమె మాటలు చురుక్కుమని తగిలాయి. అయినా ఏమీ మాట్లాడ కుండా దిగిపోయాడు.

వృద్ధుడు తన దుర్దశకు చింతిస్తూ ఓ చెట్టుక్రిందికి వెళ్ళి బట్ట కప్పుకు కూర్చున్నాడు వణుకుతూనే. అక్కడ కొన్ని చోట్ల రైలు పట్టాలు పాడైనందు వల్ల మరీ రెండు గంటల వరకు రైలు కదలదని రైల్వే అధికారులు చెప్పారు. ప్రయాణీకులందరూ తమ యిష్టం వచ్చిన భాషతో ప్రభుత్వాన్ని విమర్శించారు. "బ్రిటిష్ వాళ్ళ కాలంలోనే రైళ్ళరాక పోకలు బాగున్నాయి." అన్నాడు ఓ ఆసామీ. "వాళ్ళ కాలంలో రైళ్ళు ఎంత సవ్యంగా నడిచాయండీ." అంటూ మరో పెద్ద మనిషి మొదటి ఆయన విమర్శనను మెచ్చుకున్నాడు. అసలు ఆళ్ళ బుద్ధులే ఏరు" అన్నాడు మరో అబ్బి తుసుక్కున ఉమ్మేస్తూ.

టికెట్ కలెక్టరు టీ కొట్టు దగ్గరికి వెళ్ళి ఓ టీ అడిగి తెప్పించు కున్నాడు. వెచ్చని టీ నోట్లో పడగానే అతనికి ఉత్సాహం వచ్చింది. "ఈ చలిలో యీ వెచ్చటి టీ ప్రాణానికి ఎంత హాయినిచ్చింది" అనుకున్నాడు. వెంటనే అతనికి చలితోటి బాధ పడుతున్న వృద్ధుడు జ్ఞాపకం వచ్చాడు. తను ఎంత క్రూరంగా ప్రవర్తించాడో. అతనికి అరమైంది. దింపేసి నప్పటికి ఆ వృద్ధుడు ఏమీ మాట్లాడకుండా దిగిపోయాడు. అతను చలితో ఎంత బాధ పడుతున్నాడో పాపం! అతని ముఖం ఎంత నిర్మలంగా ఉంది! టికెట్ కలెక్టరు యింక నిలువలేక పోయాడు. వెళ్ళి ఆ వృద్ధుని వృత్తాంతం తెలుసుకోవాలన్న ఆతృత అతనిలో అధికమైంది. ఇంక నిలబడ లేకపోయాడు. వెంటనే వృద్ధుడున్న చోటకి వెళ్ళాడు. వృద్ధుడు ఒక పల్చటి పంచ కప్పుకొని ఏవో సంస్కృత శ్లోకాలు చదువుకుంటున్నాడు.

"మిమ్మల్ని నేను శ్రమ పెట్టాను. క్షమించండి." అంటూ వృద్ధుడి ఎదురుగా కూర్చున్నాడు టికట్ కలెక్టరు.

"క్షమించడానికే ముంది నాయానా. నీ ధర్మం నువ్వు నెరవేర్చావు. ఇంతకీ నా దురదృష్టాన్ని నిందించుకోవాలి తప్ప మరేమీలేదు." అన్నాడు వృద్ధుడు,

"అసలు మీరెవరు, ఎక్కడికి వెడుతున్నారు, ఎందుకు వెడుతున్నారు? యీ వయసులో మీకు సేవచేసే వాళ్ళు ఎవళ్ళూలేరా? మీ చరిత్ర వినాలని నాకు చాలా కుతూహలంగా ఉంది. ఇంకా బండి కదలడానికి చాలా ఆలస్యం ఉంది. చెప్పండి." అన్నాడు టికెట్ కలెక్టరు,

"నా కథ వినాలని కుతూహలంగా ఉందా నాయనా? తప్పకుండా చెపుతాను, కూర్చో." అంటూ చెప్పటం మొదలు పెట్టాడు.

"మధ్యరకం కుటుంబాల్లో మాదొక కుటుంబం. మా నాన్న సంస్కృతపండితుడుగా ఓ హైస్కూల్లో పనిచేసేవాడు. అపుడు నేను 5 వతరగతి చదువుకి స్వస్తి చెప్పి సంస్కృతం మొదలు పెట్టాను. మా నాన్నే నాకు చదువు చెప్పేవాడు. ఆయన బ్రతికున్నంతకాలం నాకు బాధ్యత తెలిసేదికాదు. 10 మందిగల సంసారాన్ని ఆ వచ్చే వంద రూపాయలతో ఎట్లా నడిపేవాడో నాకు అర్థం అయ్యేది కాదు. మొదట్లో నన్ను బి. యే. వరకైనా చెప్పిద్దామనుకున్నాడు. కాని ఆ ఆశలు నిరాశలయ్యాయి.

18 వ సంవత్సరం వచ్చేసరికి నాకు పెళ్ళి చేశాడు. మా నాన్న మాటకి నే నేనాడూ జవదాటలేదు. ఏదో పల్లకిలో కూర్చోని ఊరేగుతుంటే నాకు ఆనందంగానే ఉండేది. చెట్టున కాయకాస్తే ఏనాటికయినా అది రాలిపోక తప్పదు. నా ఇరవయ్యోఏట మా నాన్న మట్టిలో కలిసిపోయాడు. బాధ్యత నాపైన పడింది. ఎండ వాన లెక్కచెయ్యకుండా ఉద్యోగం కోసం తిరిగాను. ఎక్కడికి వెళ్ళినా కృష్ణ పక్షమే ఎదురయింది.

సంవత్సరం గడిచి పోయింది. ఈ సంవత్సరంలోను ఉద్యోగం కోసం ఎన్నో ప్రయత్నాలు చేశాను. కాని భగవంతుడికి నేను ఉద్యోగం చేయటం యిష్టం లేక పోయింది. కుటుంబపరిస్థితులు అనాటికానాడు దుర్భరంగా తయారయ్యాయి. మా నాన్న బ్రతికుండగా మా అన్నయ్య పెళ్ళి కోసమని రెండువేలు అప్పు తెచ్చాడు. బాకీదారులు నెత్తిమీద కూర్చున్నారు. ఈ పరిస్థితులుల్లో మా అమ్మ బెంగపెట్టుకు చచ్చిపోయింది.

నాలో ఉండే ఉత్సాహం చచ్చిపోయింది. ఆమె దహన క్రియలకు కూడా నా దగ్గఱ డబ్బు లేదంటే నీకు ఆశ్చర్యంగా ఉండవచ్చు. కాని ఒక పూట భోజనమే చేస్తూ, రెండవ పూట ఏ అరటి పళ్ళో తిని పడుకుంటుండే నా దగ్గఱ డబ్బు ఎల్లా ఉంటుంది? ఆ ఊళ్ళోనే ఉన్న మా మేనమామ దగ్గఱకెళ్ళి ఏడ్చాను. ఆయన వడ్డీ వ్యాపారస్థుడు. ఆయనకు డబ్బేచుట్టం మరెవ్వరూ కాదు. నోటు రాయించుకొని వంద రూపాయిలిచ్చాడు, తల్లి దహన క్రియలు పూర్తిచేశాను. మళ్ళా పరిస్థితులు మామూలే. ప్రయివేట్లు చెప్పుకుంటే కొంత డబ్బయినా వస్తుందని అందరిళ్ళకి వెళ్ళి అడిగాను. మొత్తం రోజూ 10 ఇళ్ళకు వెళ్ళి చెప్పుతూ ఉండేవాణ్ణి, ముప్పయి రూపాయలు వచ్చేవి. ఇంకా ఓ చెల్లిలికి పెళ్ళి చేయాలి అప్పటికి.

ఆ సంవత్సరమే నా భార్య కాపురానికి వచ్చింది. వచ్చినది మొదలు ఆమెకు కష్టాలు తప్ప మరేంలేవు. ఆమెనునేను ఎప్పుడూ ఏదికావాలని అడగలేదు నాకుయిది కావాలని ఆమె నన్ను అడగలేదు. నా జీవితంలో ఆమెకు ఒక్క చీర కూడ కొనలేదు నేను. ఓర్పు వహించలేక భూదేవయినా అప్పుడప్పుడు బీటలు తీస్తుంది కాని, నా భార్య మటుకు ఏనాడూ ఏ విషయంలోనూ విసుక్కోలేదు. అల్లాంటి సాధ్విని కష్టాలపాలు చేసినందుకు భగవంతుడు నాకే శిక్ష విధిస్తాడో తెలియదు.

అయిదు సంవత్సరాలు కాలప్రవాహంలో గబగబ ముందుకు పోయాయి. ఎన్నో సంసారాల్లో ఎన్నో మార్పులు వచ్చాయి. మా ప్రక్కింటి ఆడ పిల్ల లిద్దరికి పెళ్ళిళ్ళయి పోయి కాపురాలకు వెళ్ళిపోయారు. 20 సం॥ల వయస్సువచ్చినా నా చెల్లెలికి సంబంధం దొరకలేదు. దాని యీడుపిల్ల కాపురానికి వెళ్ళి అప్పుడే ఓ పండంటి కుర్రాణ్ణి ఎత్తుకొని పుట్టింటి కొచ్చింది. ఆరోజు రాత్రి నా చెల్లెలు గదిలో ఒంటరిగా కూర్చుని ఏడుస్తుంటే చూశాను, కుమిలిపోయాను, కాని ఏం చేయగలను? కట్నాలు — కట్నాల సమస్య సాధించలేక పోయాను. నేనేమిటి? ఆ సమస్య ఎవ్వడూ సాధించలేదు.

వయసులో ఉన్నవాళ్ళు తప్పు చేశారంటే అది కేవలం వారి తప్పుకాదు. తమ యీడు పిల్లలు అత్తారింటినుండి వచ్చి తమ భర్తల తాలూకు యోగ్యత, తమ కాపురంతో ఉండే ఆనందం, వర్ణించి చెప్తుంటే ఉప్పు, కారం తింటున్న ప్రతి స్త్రీకి వళ్ళు పులకరించక మానదు. నా చెల్లి తప్పు చేసింది. ప్రక్కింటి వాళ్ళ బ్బాయితోటి రహస్యంగా కాపురం చేసింది. ఆ కుఱ్ఱవాడు మనసారా ప్రేమించానని కల్లబొల్లి కబుర్లుచెప్పి దాని జీవితాన్ని నాశనం చేసి మన స్ఫూర్తిగా వదిలి పెట్టి వెళ్ళిపోయాడు. దాని ఫలితం నా చెల్లి గర్భవతి కావటమే.

అవి చేతులు కావు- అది మనసు కాదు. అంత పశుత్వం నాలో ఎందుకు ప్రవేశించిందో తెలియదు. ఆ రాత్రి నా చెల్లెలు దుఃఖ పడుతూ జరిగిన గ్రంథం అంతా చెప్పింది కన్నీటితో. నాకు కోపం ఆగలేదు. ఎన్ని దెబ్బలు కొట్టానో తెలియదు. స్పృహ తప్పి పడి పోయింది, చుట్టుపక్కల వాళ్ళు నలుగురూ వచ్చి నన్ను కేకలేసి, అసలు సంగతి తెల్సుకున్నారు, మర్నాటికి ఊరంతా పొక్కి పోయింది, ఇక దానికి పెళ్ళవుతుందనే ఆశ ముకుళించుకు పోయింది, దాని జీవితాన్ని పతనం చేసిన కుఱ్ఱవాడి ఎడ్రస్సు తెలుసుకొన్నాను. ఏలూర్లో ఉంటున్నాడు. అక్కడికెళ్ళి వాళ్ళ తండ్రితో సంగతంతా చెప్పి దాని జీవితం పాడు చెయ్యవద్దని. వాళ్ళిద్దరకు పెళ్ళి చెయ్యమని కాళ్ళమీద పడ్డాను, ఆయన జమీందారు. ఓ వంద రూపాయలు తీసుకువచ్చి నన్ను వెళ్ళిపొమ్మన్నాడు. ఆ పరిస్థితుల్లో ఆ వంద రూపాయలు తీసుకొని దాని జీవి దాన్ని బాగుచెయ్యనా? ఆయన్ని గట్టిగా కేకలేశాను, పశువు కన్న అన్యాయంగా ప్రవర్తించావని తిట్టాను. దానికి ఫలితం, జవాన్లు నన్ను బయటకు గెంటారు, ఇంటికి వచ్చి సంగతంతా చెల్లికి చెప్పాను. ఏడ్చింది. నేనూ ఏడ్చాను. కడుపుతో ఉన్న నా చెల్లెలు ఆత్మ హత్య చేసుకొంది. నా జీవితంలో మొదటి అంకం సమాప్తి అయింది.

కాల ప్రవాహంలో 15 యేళ్ళు దొర్లిపోయాయి. నాకు యిద్దరాడ పిల్లలు, ఇద్దరు మగ పిల్లలు పుట్టారు. పెద్ద వాడికి 14 సం॥లు నిండాయి. భగవంతుడు పిల్లల్నిచ్చాడు కాని వాళ్ళను వృద్ధిలోకి తీసుకురావడానికి తగినంతస్తోమత నాకు కల్పించలేదు. ఇంటికి రావడం అంటే నరకంలోకి వెళ్ళినట్లుగా అయిపోయింది. ఒక పూట భోజనం చేసినా

చాలేది కాదు. పెద్ద వాడు అయిదో ఫారం ప్యాసయ్యాడు. తరువాత చెప్పించటానికి నా దగ్గఱ స్తోమత లేదు. ఆడ పిల్లలు పెద్ద వారవుతున్నారు. ఎన్నో సార్లు ఒంటరిగా కూర్చొని ఆలోచించే వాణ్ణి. ఎల్లాగ యీ సమస్యలు పరిష్కరించాలో- కాని ఏంలాభం. నా తాహతుకు మించిన సమస్యలు అన్నీను. నామీద భగవంతుడికి కోపం అధికమైంది. నా శోభనదేవత, భూదేవి లాంటి భార్యను పొట్టపెట్టుకున్నాడు. దానికి నేనే కారణం. మంచి మందులు యిప్పించటానికి డబ్బులేదు. ప్రభుత్వ ఆసుపత్రిలో యిచ్చిన నీళ్ళు ఆమెకు పనిచేయలేదు. అయిపోయింది. నా జీవితంలో రెండో అంకం అక్కడితో సమాప్తి అయిపోయింది.

పెద్దకొడుకు చెప్పకుండా పారిపోయి యిప్పటికి 15. ఏళ్ళు అయింది. ఇంతవరకు వాడురాలేదు. ఎక్కడున్నాడో. ఏంచేస్తున్నాడో తెలియదు. వాడికోసం ఎన్ని రాత్రిళ్ళు నిద్రపోకుండా అలమటించిపోయానో భగవంతుడేసాక్షి. అతికష్టంమీద పెద్దపిల్లకు పెళ్ళిచేశాను. కుర్రవాడు మూడవఫారం ప్యాసయ్యాడో ఫేలయ్యాడో తెలియదు. కాని ఏదో కంపెనీలో "అటెండరు"గా పనిచేస్తున్నాట్ట. 50. రూ॥ యిస్తారు. కాని కాపురానికి వెళ్ళిన రెండో నెలలోనే అత్తగారు, భర్తకలిసి దాన్ని కిరసనాయిలు పోసి, అంటించి. చంపేశారు. నా బ్రతుకుయిలా నవ్వులపాలవుతుందని అనుకొలేదు. నాలోవుండే అభిమానం చచ్చింది. గుండెనిబ్బరం చేసుకున్నాను. కూతురు చచ్చిపోయినా, నేను ఏడవలేదు. అసలు విచారించలేదు కూడాను. ఇంకోకొడుకుని, కూతుర్ని అనాధ శరణాలయంలో చేర్పాను. వీళ్ళచేత పనులు చేయించుకొని వాళ్ళు ఇంత అన్నం పెడుతున్నారు. వాళ్ళకి అక్కడ వదిలేసి యిప్పటికి 10 సం॥ లయింది. వాళ్ళను చూడ్డానికి కూడ వెళ్ళలేదు. వెళ్ళాలనికూడా నాకులేదు అసలు భగవంతుడనే వాడొకడుఉంటే అతనికి వాళ్ళభారం వదిలిపెట్టాను.

ఇంక ఒక్కకోరిక నేను అలవరచుకొన్న స్వల్ప జ్ఞానంతో "జీవితయాత్ర" అనే పుస్తకం రాస్తున్నాను. ఇంకా కొంతమిగిలి పోయింది. అదికాస్తా వెంకటేశ్వర స్వామి సన్నిధిలో పూర్తిచేసి జీవితశేషం అక్కడే గడుపుదామనుకున్నాను. చేతిలో రెండురూపాయలకంటె ఎక్కువలేదు. అయినా తెగించి రైలెక్కాను. తరువాత సంగతి నీకుతెలిసిందే" అంటూ వృద్ధుడు కథ ముగించాడు. "టికెట్ కలెక్టర్" కళ్ళనుంచి అప్రయత్నంగా అశ్రువులు రాలాయి. ఏతండ్రి యింట్లోంచి తాను 15 సం లక్రితం పారిపోయాడో ఏతండ్రి తనకుజన్మ, యిచ్చాడో ఏ మహానుభావుడు తన భవిష్యత్తుకోసం ప్రాకులాడి కష్టించి తమని పోషించాడో, ఆతండ్రి యీనాడు దిక్కులేని పక్షిగా ఓ చెట్టుక్రింద కూర్చుని తన విషాదగాథని చెప్తే, తను విన్నాడు ఆ తండ్రిని తను తిట్టాడు. తన చెల్లెలు చచ్చిపోయింది. మిగిలిన యిద్దరూ అనాథశరణాలయంలో దిక్కులేకుండా ఉన్నారు. తండ్రితో అధోగతి పాలయ్యాడు. తనో, హాయిగా లంచాలుమరిగి, ప్రేమించి పెళ్ళిచేసుకున్న యువతిచేతిలో కీలుబొమ్మ అయిపోయి కనీసం తండ్రిని చూడటానికయినా వెళ్ళలేదు- ఛీ తనదీ ఒకజన్మేనా? తనూ ఒక మానవుడేనా?

టికెట్ కలెక్టర్ అమాంతంగా తండ్రికాళ్ళమీద పడ్డాడు "నాన్నా-నన్ను గుర్తుపట్టలేవా? నీపెద్దకొడుకు రామాన్ని" ఇక చెప్పలేకపోయాడు ఒక్కసారి కొడుకు కళ్ళలోకి చూశాడు వృద్ధుడు ఆశ్చర్యం కలగలేదు అతనికి ఒక్కటే మాట అన్నాడు.

"పోనీలే నాయనా నువ్వేనా బాగుపడ్డావ్. అదే నాకు కావలసింది."

వృద్ధుడికి ఆయాసం ఎక్కువైంది అల్లాగేతూలి పడిపోయాడు. రామం డాక్టర్ని తీసుకురావడానికి ఊళ్లోకి వెళ్ళాడు కాని మళ్ళీ వచ్చేటప్పటికి ఆతండ్రి అక్కడసజీవుడై లేడు.